# సింగిల్ పేజి కథలు

# ఆఖరి అస్త్రం

రాత్రి ఎనిమిది గంటలవుతుంది.

సుబ్బారావు దిగాలుగా ఇంటికి వచ్చేసరికి భార్య కమల పరిస్థితిని అర్థం చేసుకుంది.

"ఆ ముగ్గురూ మాయమాటలు చెప్పి డబ్బులు తరువాత ఇస్తామన్నారుగా" సూటిగా అడిగింది కమల.

"అవును. వాళ్లు కష్టాల్లో ఉన్నారట ఏమి చేస్తాం? అంతా నా కర్మ" అసహనంగా సమాధానమిచ్చాడు సుబ్బారావు.

భర్తను విసిగించడం వల్ల ప్రయోజనం లేదు. ఈ ఆలోచనతో బి.పి పెరిగితే డబ్బులు పోయి, ఆరోగ్యం పోయి నష్టమంతా తన కళ్లకు కనిపించడంతో భర్త మనస్సును మరల్చడానికి "ఏమండీ! పోయిన డబ్బుల గురించి ఆలోచించకండి. ఇక నుండి నెలనెలా మంచి చిట్ ఫండ్ కంపెనీలో చీటీ కడదాం. ఆ డబ్బులతో పిల్లల చదువుకు నిధి ఏర్పాటు చేద్దాం." ధైర్యం చెప్పింది కమల.

ముగ్గురి దగ్గర ముప్పై వేలు రాబట్టుకోవడంతో తన అసమర్థతను కప్పిపుచ్చుకోలేక దిగాలుగా ఉన్నాడు.

* * *

సుబ్బారావు ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్. ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానన్న భరోసా ఇచ్చే మనిషి.. అతని మంచితనం ఆసరాగా తీసుకొని తన కొలీగ్స్ ముగ్గురూ పదేసి వేలు చేబదులు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా ఈరోజు ఇస్తాం రేపు ఇస్తాం అంటూ కాలక్షేపం చేయసాగారు.

సుబ్బారావు బోళామనిషి కాబట్టి కొలీగ్స్‌ను గట్టిగా ఏమీ అనలేక తనలో తానే మధనపడిపోయేవాడు.

ఆఫీసులో వాళ్లని అడిగితే వాళ్లు ఫీలవుతారేమోనని రోజూ వాళ్లింటికి వెళ్లి రిక్వెస్టు చేస్తూ అడిగేవాడు.

"మేమేమైనా పారిపోతామా? నీ కళ్లెదుటే పనిచేస్తున్నాంగా ఉన్న వెంటనే ఇచ్చేస్తాం అని ఒకసారి కటువుగా అంటే మరోసారి మా కష్టాలు నీ కష్టాలు కావా?" అని సెంటిమెంట్‌తో కొడుతూ సుబ్బారావును తమ దారికి తెచ్చుకుంటున్నారు.

ఇలా రోజూ వాళ్ల ఇళ్లకు వెళ్లడం కష్టంగా ఉన్నా ప్రామిసరీ నోటుల్లేని డబ్బును నెమ్మదిగా రాబట్టుకోవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చి సహనంతో కాలాన్ని గడుపుతున్నాడు సుబ్బారావు.

* * *

తెల్లవారింది. "ఈ రోజు ఆఫీసు నుండి చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్లి లక్ష రూపాయల చిట్ కట్టండి మర్చిపోవద్దు. నెలకు రెండు వేలు ఏభై నెలలు" సుప్రభాత వేళలోనే చెప్పింది కమల.

సుబ్బారావు సరే అన్నాడు.

ఆఫీసుకు వెళ్లాక భార్య చెప్పినట్టే లంచ్‌టైమ్‌లో చిట్ ఫండ్ కంపెనీలో రెండు వేలు కట్టి పేరు నమోదు చేయించుకుని చీటీపాట తేదీ కూడా కనుక్కొన్నాడు.

* * *

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన సుబ్బారావు భార్యతో చీటీపాట తేదీతో సహా చిట్ ఫండ్ కంపెనీలో జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్టు చెప్పాడు.

"ఏమండీ నరకాసురుడ్ని చంపినదెవరు?" ప్రశ్నించింది కమల.

భార్య ఒక్కసారిగా పురాణాల్లోకి వెళ్లేసరికి అయోమయంలో పడి "కృష్ణుడు పోరాటం చేసినా చివరికి సత్యభామ చేతిలో చనిపోయాడు." అన్నాడు సుబ్బారావు.



"మీ ముగ్గురి కొలీగ్స్‌తో ఇంతవరకు మీరు శాంతియుతంగా పోరాటం చేశారు. ఫలితం లేకపోయింది. ఇప్పుడు నేను సత్యభామలా ఆఖరి అస్త్రం మీ కొలీగ్స్‌పై ఉపయోగిస్తాను. ముగ్గురూ మూడు పదివేలు ఇంటికే తెచ్చి ఇస్తారు" అంది కమల.

సత్యభామ అవతారం అనేసరికి సుబ్బారావు కంగారుపడ్డాడు. కొలీగ్స్‌పై ప్రత్యక్ష యుద్ధానికి వెళ్లి తనకి చెడ్డ పేరు తెస్తుందేమోనని బాధపడ్డాడు కూడా.

"మీ ముఖంలో ఫీలింగ్స్ మారుతున్నాయి. మీ పరువు తీసే పని ఏమైనా చేస్తానన్న అనుమానం మీలో ఉందా?" ప్రశ్నించింది కమల.

అవుననక కాదనక ముభావంగా ఉండిపోయాడు సుబ్బారావు.

"ముల్లును ముల్లుతో తీయాలని మీరు వినే ఉంటారుగా. ఈ నెల చిట్ మనకు అనుకూలంగా ఉంటే పాడండి" అంది కమల.

చిట్ పాట పాడే రోజు వచ్చింది. సుబ్బారావు చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్లి పాటలో పాల్గొన్నాడు. అదృష్టం బాగుంది. పోటీ పెద్దగా లేకపోవడంతో తక్కువ నష్టానికే చీటీ డబ్బును తన సొంతం చేసుకున్నాడు సుబ్బారావు.

కంపెనీవాళ్లు ఫార్మాలిటీస్ ప్రకారం ముగ్గురి చేత ష్యూరిటీ సంతకాలు చేయించాలి అని చెప్పారు.

ఎవరా ముగ్గురని ఆలోచించుకుంటూ ఇంటికి వచ్చి భార్యతో చెప్పాడు సుబ్బారావు.

"మీ ముగ్గురు ఋణగ్రస్తులైన కొలీగ్స్" అంది కమల.

"ఆ ముగ్గురు పెడతారా?" అనుమానంగా అడిగాడు సుబ్బారావు.

"మీ ఆర్థిక క్రమశిక్షణ వాళ్లకు తెలుసు కాబట్టి. అందులో మనకు డబ్బులు ఇవ్వాలి ఆ మొహమాటానికైనా సంతకాలు చేస్తారు" అంది కమల.

కమల చెప్పినట్టే ముగ్గురు కొలీగ్స్ దగ్గరకు వెళ్లిన వెంటనే సుబ్బారావు ష్యూరిటీ సంతకాల పని సులభంగా అయిపోయింది.

సుబ్బారావుకు చిట్‌ఫండ్ కంపెనీ నుండి రావల్సిన డబ్బు వచ్చింది. సుబ్బారావు చేత మూడు నెలల పాటు చీటీ పాట డబ్బులు కట్టనివ్వలేదు కమల.

నాలుగో నెలలో ష్యూరిటీ ఇచ్చిన వారికి చిట్ ఫండ్ కంపెనీ తరపున కోర్టు నుండి శ్రీముఖాలు.

ముగ్గురు కొలీగ్స్ ఒకటే పరుగుతో సుబ్బారావు ఇంటి ముందు వాలారు.

"ఏంటీ దారుణం" నిలదీసి అడిగారు సుబ్బారావుని ముగ్గురు కొలీగ్స్.

కమల కలుగజేసుకొని "ఈమధ్య మా ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేదు. మీరు ఇవ్వవలసిన డబ్బు మాకు ఇచ్చేస్తే అంతా సర్దుకుపోతుంది. లేకపోతే ఏమీ చెయ్యలేం" బాధపడుతున్నట్టు చెప్పింది.

ముగ్గురు కొలీగ్స్ ఒక పక్కకు చేరారు. "మనం ఇవ్వాల్సింది ముప్పై వేలు. కోర్టు నోటీసుల ప్రకారం తొంభై ఎనిమిది వేలు. దానికి తోడు పెనాల్టీలు కోర్టు ఖర్చులతో మొత్తం లక్ష రూపాయలు కోర్టుకు మొహమాటం ఉండదు. ముక్కు పిండి వసూలు చేస్తారు. ముందు ముప్పై వేలు ఇచ్చి తక్షణం ఈ సమస్యకు పరిష్కారం చూపాలి" అంటూ చర్చించుకుంటూ ముప్పైవేలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.

ముగ్గురు కొలీగ్స్ ఇంటికి వెళ్లి ముప్పై వేలు తెచ్చి సుబ్బారావు చేతిలో పెట్టారు. "రేపే వెళ్లి చిట్‌ఫండ్ కంపెనీకి డబ్బు చెల్లించి కోర్టు నోటీసుల నుండి విముక్తి కలిగించు" అన్నారు ముక్తసరిగా.

ముగ్గురు కొలీగ్స్ వెళ్లిపోయాక సుబ్బారావు కమలను తన ఒడిలోకి తీసుకొని సత్యభామలా నువ్వు ప్రయోగించిన ఆఖరి అస్త్రం మంచి రిజల్టే ఇచ్చింది అంటూ నుదుటున ముద్దు పెట్టాడు.

-బి.వి.పట్నాయక్ (పార్వతీపురం)